# డాక్టర్ అపర్ణా యేలూరుపాటి



జన్మస్థలం యేలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేష్, 1968. చదువు: M.A., ఆంధ్ర విశ్వనిద్యాలయం, వైజాగ్. Ph.D., పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్. డాక్టరు పట్టంకోసం వీరు పరిశోధన అంశం ప్రబంధ సాహిత్యంలో కుటుంబ వ్యవస్థ. గతంలో తెలుగు ఉపాధ్యాయనిగా పదిహేడు సంవత్సరాలు ఉద్యోగం. వివిధ వార, మాస పత్రికలలో కధలు, All India Radio ద్వారా, కవితలు, కధానికలు వ్రాసారు. National Literary Project వారి పోటీలలో బహుమతులు అందుకున్నారు. ప్రస్తుతం Bridgewater, New Jersey లో నివాసం; All State Insurance, New Jersey లో ఉద్యోగం.

## వింధియా నవల - సమీక్ష

# రాజేశ్వరి - ఒక అమ్మాయి కధ

రాజేశ్వరి అచ్చమయిన తమిళ అమ్మాయి. అయినా, చదువుతున్నంతసేపూ తెలుగు అమ్మాయి కధలాగే ఉంటుంది. బహూశా కొన్ని ఆచారవ్యవహారాల్లో తేడాపాడలు ఉన్నప్పటికీ దక్షణభారతదేశ సంప్రదాయాలు అన్నీ సుమారుగా ఒకేలాగ ఉండడం కారణం కావచ్చు. దక్షణభారతం మాత్రమే ఏమిటి? అసలు భారతదేశ సంప్రదాయమే చాలావరకు ఒకేలాగుంటుం ది. ఎందుకంటే, కుటుంబంలో భర్త యజమాని, భార్యాపిల్లలు అనుయాయులు, స్వతంత్ర నిర్ణయం లేనివారు. ముఖ్యంగా ఆయన ఇష్టానిష్టాలే ఇంట్లో చెల్లుబాటు అవుతుం టాయి. అలా అని భర్త నిరంకుశుడు కాదు. తన కుటుంబానికి ఏదేది ఎప్పుడెప్పుడు అవసరమో, ఎంతవరకు అవసరమో. వాటిని ఎలా సమకూర్చాలో ఆయనే పాట్లు పడుతుంటాడు. తక్కినవారు అనుసరించి వెళ్తుంటారు.

ఇక కధ విషయంకి వస్తే, ఒకరకంగా ఇది మానవ విశ్లే షణాత్మక నవల అనిపిస్తుంది. పెళ్ళివయసు వచ్చిన యువతిగా రాజం కధ మొదలైన దగ్గరనుంచి, పెళ్ళిచేసుకొని అత్తవారింటికి వెళ్ళిన తరువాత ఆమె తన కాపురంలోఎదురైన రకరకాల ఒడిదుటుకులకి తట్టుకుంటూ, మంచి జరిగినప్పుడు ఆనందపడుతూ, వ్యతిరేక సన్నివేశాలు ఎదురైనప్పుడు సందర్భాన్ని బట్టి సద్దుకుపోతూ, మరీ మనస్థాపానికి గురైనప్పుడు దుఃఖం కలిగినా, త్వరలో జరగబోయే మంచికోసం ఎదురుచూస్తూ, కొన్నికొన్ని సార్లు విపరీతమైన మానసిక సంఘర్షణకు గురైన యువతిగా ఆమెకు రకరకాల సందర్భాల్లో కలిగే ఆలోచనలను, ఉద్వేగాలను చాలా చక్కగా కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు రచయత్రి ఇందియాదేవి.

రచయత్రి సహోదరులు శ్రీ రంగన్ సుందరేశన్ అనువాదకుని ముందుమాటలో చెప్పినట్టు ఇదొక అసంపూర్ణ నవల కాదు. ఒక అమ్మాయి జీవితంలోని ముఖ్యఘట్టాలు - వివాహం, కాపురం, పిల్లు, వారి భవిష్యత్తు. ఇందులో అన్నీ అన్ని కధల్లోనూ ఉండాలని నియమం ఏమీ లేదు. కొన్ని కొన్ని ఘట్టాలను, ఆయా సందర్భాల్లో వివిధ పాత్రల వ్యవహారపు తీరుని వ్రాసిన

తరువాత రచయత్రికి  ఇంక ఆ రచన సమగ్రమనే భావన కలిగి ఉండవచ్చు కూడా.

సాధారణంగా, ఏదో కాల్పానిక కథల్లోనో, నవలల్లోనే తప్ప చాలామంది రచయితలు వ్రాసే కథల్లోనూ, రచనల్లోనూ, 'నేలవిడిసాము' ఉండదు. అంటే, ఆయాకాలాల్లో తమచుట్టూ జరిగిన సంఘటనలో, పరిచయమైన మనుషుల్లో, మనసుకు నచ్చిన-నచ్చని ఘటనలు, మనసుకు హత్తుకున్న విషయాలు, మనుషులు ఇవన్నీ/వీరందరూ రకరకాల సంఘటనల్లో, పాత్రల్లో, దర్శనమిస్తూ ఉంటారు; కొన్ని కొన్ని పాత్రల్లో రచయతలు స్వయంగా కనబడతారు కూడా.

ఇందియాదేవి కూడా తనకాలంనాటి అనేక విషయాలను, వ్యక్తులను తన రచనల్లో మనకు దర్శనం చేయిస్తూ ఉంటారు. నేను గతంలో చదివిన వింధియా కథల్లో, నాకు అటువంటి భావనే కలిగినప్పటికీ, ఈ నవలలో మాత్రం ఇందులోని పాత్రలు, సంఘటనలు కొన్ని అయినా, ఆమె స్వయంగా అనుభవించినవే కావచ్చు అనిపించింది. కనీసం రాజం పాత్రలో ఇందియాదేవి అక్కడక్కడ పరకాయ ప్రవేశం చేసివుండాలి, లేదా అటువంటి యువతిని చాలా దగ్గరలో చూసివుండాలి. మరి నా విశ్లేషణ నిజం అవునో కాదో ఆమె సోదరిసోదరులే రూఢీ పరచాలి. ఎందుకంటే, ఈ నవలలోని కొన్నిఘట్టాలు కేవలం ఊహామాత్రంగా వ్రాయగలిగే అవకాశం చాలా తక్కువ.

ఇక, కథలో ప్రవేశిస్తే, కథ రాజేశ్వరి అనే పాత్ర చుట్టూ అల్లుకొనివుంది. కథను రచయత్రి నాలుగు ముఖ్య భాగాలుగా విభజించారు. 1. **తీయని ఊహలు**. 2. **అడుగడుగునా చిక్కులు**. 3. **శృతి తప్పిన రాగం**. 4. **చెదిరిన ఆదర్శం.** ఆయా విభాగాల్లో నామసార్ధక్యం మనకు గోచరమౌతుంది.

ఇకపాత్రలు - రాజం తండ్రి నటరాజన్ గాంధీయవాది, దేశభక్తుడు. కుటుంబంపట్ల ప్రేమ, బాధ్యత కలవాడు. ఉద్యోగ్యరీతా తెలుగుదేశంలో స్థిరపడవలసి వచ్చినా, తన పిల్లలు తమిళ భాషకు, సంప్రదాయాలకు దూరం కాకూడదని తమిళ భాషను చదవడం, వ్రాయడం, తమిళ పండుగలు జరుపుకోవడం, అన్నీ నేర్పేవారు. ఇంటికి తమిళ పత్రికలను రప్పించడం కూడా భాషను దగ్గరచెయడానికే. తల్లి విశాలం తనకు రాజం తరువాత పుట్టిన పసిపిల్లలతో సతమతం అవుతున్నా, కూతురుచేత మాత్రం తెల్లవారుఝామునే సంగీతసాధన చేయడమే కాక ఆమెకు పనిపాటలు, తమిళదేశ సంప్రదాయాలనుకూడా నేర్పాలనే తపన కలిగిన ఇల్లాలు; భర్తకు తగిన భార్య.

రాజం యౌవన ప్రాయంలో అడుగుపెట్టిన పడతి. అమ్మాయిగా యీడేరిన తరువాత, వివాహవయసు వచ్చిన దగ్గరనుంచి పెళ్ళిగురించి కలలు, ఊహలు సాధారణం. ఆ వయసులో వారికి ప్రతీ చిన్న విషయం అందంగా, ఆహ్లాదకరంగా కనబడడం సహజం. మంచి ఉపాధ్యాయులు శర్మగారి శిక్షణలో ఆమె చక్కని గాత్రసంగీతం మాత్రమేకాక, వయలిన్ వాయించడంలో ప్రావీణ్యం గడిస్తోంది. తన పాటను అందరూ మెచ్చాలని, తాను సభల్లో పాడాలని కలలు కంటోంది. తన తోబుట్టువులపట్ల ప్రేమ, వారిపట్ల అధికారం, ఆపేక్ష కలిగిన ఆదర్శ సోదరి రాజం.

తండ్రి తను పనిచేస్తున్న ఉద్యోగంలో గతంలో పనిచేసిన పెద్దమనిషి దొరస్వామిని కలిసినప్పుడు ఆయనకి పెళ్ళికి వచ్చిన కొడుకున్నాడని తెలుసుకొని సంబంధం కలపడానికి ఉబలాటపడతాడు. సంబంధం గురించి భార్యాభర్తల చర్చోపచర్చలు విన్న రాజం కూడా రాబోయే వరుడు ఎవరో, ఎలా ఉంటాడో తెలుసుకోవాలని ఆరాటపడుతుంది. పిల్లను చూసిన దొరస్వామి తన భార్యా పిల్లలనుకూడా ఆమెను చూసి రమ్మని పురమాయిస్తాడు. పెళ్ళికొడుకు రఘుపతి, తల్లి శారదాంబాళ్, సోదరి భవాని కూడా అయిష్టంగానే పెళ్ళిచూపులకి వస్తారు. శారదాంబకు తన భర్త తనతో సంప్రదించలేదు అనే కోపం ఉన్నా, కొడుకు తన మాటకి విలువ ఇస్తాడనని గ్రహించి చివరికి వారి పెళ్ళికి అంగీకరించింది.

పెళ్ళి మాత్రం స్వస్థలం కనుక తమిళనాడులోనే జరిగింది. ఇక్కడ వివాహ సంప్రదాయాల వర్ణన బాగుంది. ముఖ్యంగా పెళ్ళిలో నలుగుల్లో పెళ్ళికూతురు పాట పాడడానికి మొహమాటపడడం అందరూ వింతగా చెప్పుకోవడం చూస్తూంటే, ఆ ఘట్టం పెళ్ళిలో ఎంత ముఖ్యమో అర్థమౌతుంది. తొమ్మిదిగజాల చీర కట్టుకోవడం, హోమాలు, పెద్దలకు నమస్కారాలు విషయంలో మేనత్త ఎంత శిక్షణ ఇచ్చినా, రాజం పాట మాత్రం పాడించలేకపోయింది. (ఇలా పెళ్ళికూతురు పాట పాడడం అనే ఆచారం తెలుగునాట నేను వినలేదు, చూడలేదు. బహుశా 1940 ప్రాంతంలో ఉండేదేమో నాకు తెలియదు).

దీపావళి పండుగకి రఘుపతి అత్తవారింటికి వచ్చినప్పుడు అతనికి రాజంతో కొత్తగా అనుబంధం పెరిగింది. భవాని పాపని చూసుకొనేం దుకు రాజం, ఉద్యోగ ప్రయత్నంలో రఘపతికూడా కలకత్తాకి బయలుదేరారు. కలకత్తాలో భవాని ఇంట్లో రాజంకి భవానినుంచి చాలా సూటిపోటీ మాటలే

దొరికాయి. రాజం ఏ పని చేసినా తప్పులు వెదికే భవాని ఆమెను వదినగా ఏమీ ఆచరించలేదు సరికదా, చాలా స్పష్టంగా 'నేను ఆడపడుచును, నాకు ఎదురు చెప్పడం మంచిదికాదు!' అనికూడా హెచ్చరించింది; చివరకు ఆమె పాట పాడే విధాన్ని కూడా విమర్శించింది. తన భర్త సత్యమూర్తి అప్పుడప్పుడు రాజంను, ఆమె పాటను మెచ్చుకోవడం కూడా సహించలేకపోయింది. చివరకు తనకు నచ్చిన బొమ్మలసెట్టు కొనడానికి కూడా రాజంకి అవకాశం కుదరలేదు సరికదా అభ్యంతరం కూడా ఎదురయ్యింది. భర్తకూడా ఆమెను ఇది నీకోసమా, మీ ఇంటికోసమా అని అడిగినప్పుడు రాజం మ్రాన్పడిపోతుంది.

ఈ కథలోని రెండవ భాగం **అడుగడుగునా చిక్కులు** లో రాజం కాపురంలో పడిన ఇబ్బందులు కనబడతాయి. పెళ్ళి తరువాత, కాపురంకి వెళ్ళేముందు, చాలాకాలం తల్లిదండ్రులదగ్గరే ఉన్న సమయంలో ఆమె ఒక గృహిణికి, మహిళకి కావలసిన అన్నికౌటుంబిక ఆచారాలను, విధానాలను, తల్లిదగ్గ ర నేర్చుకున్నా, అత్త శారదాంబను మాత్రం రాజం పూర్తిగా సంతృప్తి పరచలేక పోయింది. ఆడపడుచు భవాని చూపే ధాష్టికాన్ని భరిస్తూ, ఆమె బిడ్డని సాకుతూ కూడా ఆమె అత్తవారింట్లో పెద్దగా మెచ్చుకోలుకు నోచుకోలేకపోయింది. భర్త రఘుపతి, మామగారు దొరస్వామి కూడా ఇంట్లోని సంఘటనలకు పెద్దగా విలువ ఇవ్వకపోవడంతో, రాజం చాలావరకు అనాదరణకి గురి అయ్యింది. ఆ కాలంలో అత్తగారు, ఆడబిడ్డలు అనే సంబంధీకులకి ఇంటి కోడలిపై సర్వాధికారం ఉండేవి: ఎలా అయనా తిట్టవచ్చు, దెబ్బలాడవచ్చు, ఎటువంటి పని అయినా చెప్పవచ్చు, సరిగా చెయ్యలేదని చెప్పవచ్చు. ఇది ఇప్పటికీ కుటుంబాల్లో ఉందా అంటే చెప్పలేం. కొన్ని చోట్ల, అక్కడక్కడా చెదురుమదురుగా అత్తింటి ఆరళ్ళు వినవస్తూండడం జరుగుతోంది.

పొరిగింటి పెద్దమనిషితో కలిసి తొలిసారి పుట్టింటికి వచ్చిన రాజంని చూసి 'ఇలా తయ్యారయ్యిందేమిటి?' అని తల్లిదండ్రులు విస్తుపోయారు. తల్లికి పనుల్లో సాయం చేయబోయినా ఆమెకూడా ఇంతకుముందు ఎప్పుడూ రాజం ఇలా చేతిలో పని అందుకోలేదని ఆశ్చర్యబోయింది. రాజం మనసు పుట్టింటిని చూసి పురివిప్పిన నెమలిలాగ నాట్యం చేసింది. అయితే, మళ్ళీ భర్త తన్ను తీసుకొని వెళ్ళడానికి వచ్చినప్పుడు ఆమె మనసు తన ఇంటికి తిరిగి వెళ్ళాలని తహతహలాడింది. తిరిగి అత్తింటికి వెళ్తున్న రాజంని చూసి తండ్రి

“నాన్నగారూ, ఇక్కడికి వచ్చిన తరువాత మళ్ళీ తిరిగివెళ్ళడానికి ఎలాగో ఉంది!” అని రాజం అన్న మాటలు గుర్తుచేసుకుంటాడు. ఈ సందర్భం లో ఒక ఆడపిల్లకి పుట్టింటిలో ఉండే స్వతంత్రం, అక్కడ నివసించడంలో అనురక్తి, అదే సమయంలో తన ఇంటికి తాను తిరిగి వెళ్ళాలని, తన భర్తతో కలిసివుండాలని ఉవ్విళ్ళూరడం రచయిత్రి కళ్ళకు కట్టించారు. ఆమె ఆతురతని గమనించిన తండ్రి ‘ఈ సందర్భంలో దూదినుంచి వచ్చిన వత్తులు పేనేడప్పుడు వేళ్ళు దూదిబంతికి దూరంగా కదులుతాయి; అప్పుడే ఆ తంతువులు బాగా బిగించుకుంటాయి. స్త్రీల మనోభావంకి ఇది ఒక ఉపమానం అనవచ్చా?” అని అనుకుంటాడు. ఎంత చక్కని పోలిక!

అత్తింటికి తిరిగి వచ్చిన రాజం మునపటికంటే ఉత్సాహంగా అత్తవారింటితో కలిసిపోయింది. అందరికీ అడగకుండానే సపర్యలు చేసింది. తల్లిదండ్రులకి లేఖలు రాయడం, సంగీత సాధన, రేడియో వినడం. అన్నీ చేయగలిగింది. అత్తమామలతో సఖ్యత, భర్తతో అన్యోన్యత పెరుగుతుండగానే, ఆడపడుచు భవాని పురుడుకోసం రావడంతో అన్నీ వెనకబడ్డాయి. మూడవ భాగం **శ్రుతి తప్పిన గానం** లో రాజం భవాని పురుడుకి వచ్చినప్పుడు చేసిన సేవలు, ఆమెకు కావలసినవి అందించడం , ఆమె కూతుర్ని ఎత్తుకోవడం, షికారుకి తిప్పడం, ఆడించడం మొదలైన వ్యవహారాల్లో రాజం దినచర్య మొత్తం మారిపోయింది, ఐనా, భవానిని మాత్రం ఒప్పించలేరపోయింది. ప్రతీ పనిని అందుకొని చేస్తూనేవున్నా, చిన్న చిన్న విషయాలకు కూడా రాజంని భవాని చులకన చేసి మాట్లాడడం భర్త, అత్త, మామ అందరూ గ్రహించినా భవాని వాగ్ధాటికి దడిసి ఏమీ అనలేకపోయారు. చాటుగా తండ్రి, ముఖం మీద తల్లి, మందలించబోయినా భవాని వారిమీద విరుచుకు పడిందేకాని, మారలేదు. రాజం చివరికి భర్త వేరే ప్రాంతానికి ఉద్యోగం నిమిత్తం వెళ్ళినా, బంధువుల ఇంట్లో వివాహం జరిగినా, వారేవచ్చి ఆహ్వానించినా, తన ఆడపడుచు సేవకు అంతరాయం కలగకుండా అత్తగారి ఇంట్లోనే ఉంది కాని, వారితో వెళ్ళలేదు. భవాని అత్తవారిం టికి చుట్టపుచూపుగా వెళ్ళినప్పుడు భవాని అత్తగారు కూడా తన కోడలు రాజంపై చెలాయించే పెత్తనాన్ని, చూపించే అధికారంని గమనిస్తారు. ఇలా రాజంపై భవాని ధాష్టికాన్ని అందరూ గమనించినా, భర్త, అత్తమామలు రాజంని పెద్దగా చేరదీసినదీ లేదు, భవానిని అడ్డుకున్నదీలేదు. ఈ మొత్తం ఘట్టాన్ని రచయిత్రి చాలా స్థిమితంగా, విపులంగా వర్ణించారు. చదివిన ప్రతీవారికి రాజంపై కనికరం,

భవానిపై కోపం కలుగుతాయి. ఇదే కాలంలో కాఫీ గింజలు దంచుతున్న రాజం తన వేలునికూడా పోగొట్టుకుంటుంది; వయలిన్ అభ్యాసం చెయ్యడం కూడా ఆమెకు సాధ్యం కాదు; ఒకసారి చాలా తీవ్రంగా జ్వరమూ తగులుతుంది.

ఎట్టకేలకు ఉద్యోగంలో ఉన్న భర్త దగ్గరనుంచి పిలుపు రావడంతో తన స్వంత కాపురానికి బయలుదేరిన రాజం మనసు తన సొంత ప్రపంచాన్ని ఊహించుకొని మురిసిపోయింది. తండ్రి తన్ను "కావేరినదిలాగ వర్ధిల్లు!" అని దీవించిన విషయాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుంటుంది. ఇది తన ఇల్లు అనే ఆలోచన ఆమెకు చాలా ఆనందాన్ని, స్వాతంత్ర భావనను కలిగిస్తుంది. తను ఎవరి గురించి భయపడనవసరం లేదు అనే ఊహ ఆమెకు చాలా సంతృప్తిని ఇచ్చింది. చుట్టుపక్కల వారితో స్నేహసంబంధాలు, సంగీత సాధన, భర్తతో వాహ్యాళి - ఎది చెయ్యాలన్నా చెయ్యగలిగింది. కపటం లేకుండా మనసుకి ఎది అనిపిస్తే అది వ్యక్తం చెయ్యగలిగింది. ఆమె తన వైవాహిక జీవితంలో చాలా సంతోషంగా, భర్తతో అరమరికలు లేకుండా సుఖంగా, స్వేచ్ఛగా గడపగలిగింది ఆ కొన్ని రోజులు మాత్రమే. భర్త ఉద్యోగానికి ముగింపు రావడంతో అది మూడునాళ్ళ ముచ్చటలాగానే ముగిసిపోయింది, ఐనా రాజం అసంతృప్తి పడలేదు.

పినతండ్రి కూతురు పెళ్ళికి భర్తతో కలిసి వెళ్ళిన రాజం అక్కడ భర్త అందుకున్న మర్యాదల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఆ సందర్భంలో ఆమె తాను అత్తవారింటికి వెళ్ళిన కొత్తలో తను నిలుచున్నా, కూర్చున్నా, నడిచినా, మాట్లాడినా, నవ్వినా, తనను ప్రతీవారు ఎలా గమనించేవారో, ఎన్ని రకాలుగా మాట్లాడుకొనేవారో గుర్తుచేసుకుంటుంది. ఆ అనుభవం ప్రతీ కొత్త పెళ్ళికూతురుకి ఎదురయ్యేదే. ఇందియాదేవి ఈ ఘట్టాన్ని రాజం పరంగా సమగ్రంగా చిత్రించారు.

మామగారికి పదోన్నతి కలిగి మద్రాసులో ఉద్యోగమయిందని తెలిసిన రాజం తాను మద్రాసులో వెళ్ళబోయే కచేరీలు తలచుకొని, అక్కడ మంచి గురువుల వద్ద తాను తన సంగీతాన్ని బాగా సాధన చేస్తానని, కచేరీలు కూడా చేస్తానని కలలుకన్నది. కాని, మద్రాసు వచ్చాక, అత్తగారి ప్రవర్తనలో చాలా మార్పు గమనించింది. ఆమె మునుపటిలా తనను వెనకవేసుకొని రావటం కాదుగదా, చివరికి మూడునాళ్ళ ముచ్చటికోసం వేరు కాపురానికి ప్లాన్ వేసారని వెటకారం చేయడంతో "ఈవిడ నా అత్తగారేనా?" అని ఆశ్చర్యపోయింది రాజం. చివరికి "సంగీతసభలో మెంబరు కావటానికి కూడా

డబ్బు దండగ!" అంటూ ఆవిడ ఇష్టపడలేదు. ఆ మూడు గదుల సంసారంలో రాజంకి వయలిన్ సాధనకి కూడా అవకాశం చిక్కలేదు.

పదేపదే అత్త గారు భవానిని పొగడడం, 'దానికి కల్మషం లేదు!' అని అననడం, 'దానికి అత్తగారు, తల్లి ఒకటే' అని అనడం - ఇవన్నీ భవానిని పొగిటినట్టుగా కాకుండా. తన్ను ఎత్తిపొడవటమే అని అర్థమయ్యాక రాజంలో ఆరాటం మరీ తీవ్రమైంది. తన ఆడపడుచు తన సొంత కాపురం పెట్టడానికీ, తాను తన సొంత కాపురం కి వెళ్ళడానికి తేడా ఏమి ఉందని, తాను తన భర్తతో విడిగా కలిసి ఉండడం అనేది అత్తగారి దృష్టికి అంత తప్పుగా ఉందా అని వాపోయింది.

చివరికి రాజం అత్తగారితో స్నేహం మెలగడం కూడా అత్తగారు గడసరి చర్యగానే చూసిందేగాని కోడలికి తనపట్ల ప్రేమ, అప్యాయత, ఉన్నాయన్న విషయాన్ని ఆమె అంగీకరించలేకపోయింది. గతంలో తాను రాజంని వెనకేసుకొని వచ్చినప్పుడు "అమ్మా, నువ్వు ఎవరి పక్షం?" అని భవాని అడిగిన సంఘటన అత్తగారైన శారదాంబాళ్ మనసులో నాటుకొనిపోయింది. తాను తన కూతురి పక్షంలో ఉండడమే న్యాయం అని ఆవిడ ఎప్పుడో నిర్ణయించుకుంది. తాను పోయిన తరువాత తన కూతురుకి పుట్టింటి ఆదరణ లభించదు అనే తీవ్ర అభిప్రాయం ఆవిడ మనసులో నిలబడి పోయింది. ఈ భిన్నాభిప్రా యల వల్ల అత్తాకోడళ్ళ మధ్య చాలా దూరం ఏర్పడిపోయింది.

తల్లి పురిటికి సాయం చెయ్యడానికి వచ్చిన రాజం మళ్ళీ సంగీతసాధన కూడా చెయ్యవచ్చని నిర్ణయించింది. కాని, భర్త తన్ను చూడడానికి వచ్చినప్పుడు మాత్రం పాట జోలికి వెళ్ళలేదు. శర్మగారు ఎంత చెప్పినా, ఆమె చేత పాడించలేకపోయారు. తన పాటని ఆనందించని భర్త గురించి 'అతని భార్యగా ఉండగా నేనే పాట పాడను!' అని శపథం చేసింది రాజం.

తల్లి పురుడు అయ్యాక రాజం తిరిగి మద్రాసు వెళ్తుంది. అత్తగారు ఆమెలో ఉత్సాహం గమనించినా, పుట్టింటిలో ఎక్కువ జనాలు ఉండడం వలన తన ఇంటిలో ఉన్న నిమ్మళం, విశ్రాంతి ఆమెకు అక్కడ ఉండదు అని, ఐనా రాజం అక్కడ ధృడంగా ఉంటుంది అని అంటుంది. ఈ సారి రాజం మద్రాసులో చాలా తక్కువ రోజులు ఉంటుంది.

ఇక ఆఖరి ఘట్టం **చెదిరిన ఆదర్శం** లో, తన్ను చూడడానికి వచ్చిన తమ్ముడు మణితో రాజం పుట్టినిల్లు వెళ్ళినప్పుడు ఆమె హఠాత్తుగా రావడం

చూసి తల్లిదండ్రులు ఆశ్చర్య పడతారు. రాజం "నాకు హిస్టీరియా అని అందరూ అంటున్నారు!" అని కన్నీరు విడుస్తుంది. అది చూసి విశాలం తన కూతురు ఆమె భర్తను అసహ్యించుకోకూడదు అవి కోరుకుంటుంది. ఇరుగుపొరుగువారు రాజం తన భర్తకి ఉద్యోగం లేకపోవడం వలన బాధపడుతోందని అనడం చూసి ఆమె తనకు ఆ విషయంలో ఏమీ అసంతృప్తి లేదని భర్తకి తెలియజేయాలనుకుంటుంది.

ఇలా కొంతకాలం పుట్టింట్లో తల్లిదండ్రులతో, తమ్ముళ్ళతో, చెల్లెళ్ళతో, కొంత తేరుకుంటున్న రాజం హఠాత్తుగా పసిపిల్ల అయిన చెల్లెలు చనిపోవడంతో తీవ్ర దుఃఖంలో కూరుకుపోతుంది. తన చెల్లెలు మరణంకి తన మానసిక స్థితియే, తనకి బ్రతుకుమీద కలిగిన వ్యతిరేకత, కారణమా అని ఆలోచిస్తుంది. మళ్ళీ ఈ దుఃఖం నుంచి తేరుకోవాలంటే భర్త సాన్నిహిత్యం కావాలని కోరుకొని ఉత్తరం రాసి అతన్ని రప్పిస్తుంది. అక్కడ మళ్ళీ అత్తగారి అప్పడాలను, ఆడపడుచు ధాష్టికాన్ని తలచుకొని, తాను పడిన బాధలు భర్త గుర్తించలేదని చిరాకు పడుతుంది; అతన్ని కటువుగా మాట్లాడుతుంది. తనకు ఇష్టం లేకపోయినా, అతనితో తనకు ఇష్టం వచ్చినట్లు మాటలు విసురుతూ, కఠినంగా ఎత్తిపొడుపుగా, మాట్లాడుతుంది. మళ్ళీ తనకు తనే, "నాకు తెలియకుండానే నేను ఎంత కరుకుగా మారిపోయానో?" అని ఆశ్చర్యపడుతుంది. ఇలా ద్వంద్వభావాలతో, ద్వైధీయ భావనలతో, రాజం ఉక్కిరిబిక్కిరి అవుతూవుంటుంది. ఇదంతా చూస్తున్నా ఆమె ప్రవర్తన ఎందుకలా ఉందని అర్థం కాని రఘుపతి ఎప్పట్లాగే తన తల్లి అప్పడాలని పొగడుతూ ఉంటే కోపంలో ఊగిపోతుంది; "చివరికి నా సంగీతం, సాధన మానేసి నేనుకూడా అప్పడాలు చెయ్యడానికి బానిస అవుతానేమో?" అనికూడా అనుకుంటుంది.

రాజం భర్తమీద నోరు పారేసుకోవడం చూసి తల్లిదండ్రులు కూడా గమనించి ఆమె ఎందుకలా తయ్యారైందా అని విచారిస్తారు. విశాలం భర్తతో కూతుర్ని మందలించమనికూడా చెపుతుంది. చివరికి రాజం అలా అవ్వడానికి అత్తవారింటిలో లభించిన నిరాదరణ, భవాని చూపించిన దురాదరణ కారణమని నిర్ధారించి తల్లిదండ్రులు నిట్టూరిస్తారు.

భర్త మద్రాసు తిరిగి వెళ్ళినప్పుడు కూడా నిర్లక్ష్యంగా ప్రవర్తించిన రాజం మళ్ళీ అతని ఎడబాటులో ప్రశ్చాత్తాపం పడుతుంది. భర్తతో తన పెళ్ళి తన ఉరి తాడు అనికూడా అభినయించిన సంగతి గుర్తుచేసుకొని బాధపడుతుంది.

కలలో రఘుపతి టైఫాయిడు జ్వరం వలన వినికిడి నశించినట్లు, తాను అతన్ని 'బాగా అయింది!' అని వెటకారం చేసినట్లూ కలలో రావడంతో, 'అలాంటి కల ఎందుకు వచ్చిందా?' అని తనలో తనే తర్కించుకుంటుంది. తనకు అతనిపట్ల కలిగిన వ్యతిరేకతకు తన పట్ల, తన సంగీత సాధన పట్ల అతను చూపిన నిర్లక్ష్యమే కారణమని నిర్ధారిస్తుంది.

రాజం టైఫాయిడు జ్వరంకి లోనై బాధ పడుతున్నప్పుడు శారీరకంగా, మానసికంగా, చాలా కుంగిపోతుంది. తాను మంచితనంతో అత్తవారికి సేవలు చేసినప్పుడే తనకి వేలుకి గాయం కలిగిందని, అందుకు వారిని నిందిస్తూ, వారి ప్రేమకి దూరంగా కావటం వల్లనే తనకు ఇప్పుడు ఇటువంటి స్థితి కలిగిందని బాధ పడుతుంది. తనకు ఇక వినడం, మాట్లాడడం, పోతాయెమో అని భయపడుతుంది. జబ్బు పడ్డ రాజం మనసు భర్తను చూడాలని ఆరాటపడుతుంది.

ఇంతలో భవాని మద్రాసులో బాబుని కంటుంది. అప్పుడుకూడా కోడలు రాలేదని శారదాంబాళ్ ఇబ్బంది పడుతుంది. రాజంకి టైఫాయిడు వచ్చిందని, ఒకసారి భార్యని చూసి వెళ్ళమని నటరాజన్ రాసిన ఉత్తరాన్ని చూసి శారదాంబాళ్ "మన కోడలు మన దగ్గర ఉన్నప్పటికంటే రఘుపతి అత్తగారింటిలో గడిపిన రోజులే ఎక్కువ," అని భర్తని హెచ్చరిస్తుంది.

తనను చూడడానికి వచ్చిన భర్తను చూసిన తరువాత రాజం ఆరాటం ఉపశమించింది. తాను అనవసరంగా వ్యాకులపడినట్టు, తను, తన భర్త ఆదర్శ వ్యక్తులలాగే ఉండాలని కోరుకుంటుంది. మునుపటి ధైర్యం, ఉత్సాహం, ఆమెలో క్రమంగా పుంజుకున్నాయి.

తన పుట్టిం టి ఊరులో భర్తకి లెక్చరర్ ఉద్యోగం వస్తుందని ఆమె ఎదురుచూసినా, చివరికి అది మరొకరి సొంతం అవుతుంది. చివరికి మళ్ళీ మద్రాసులోనే రఘుపతికి ఉద్యోగం దొరికిందని వార్త విని రాజంకి తీవ్ర ఆశాభంగం కలిగింది. "ఇంత ప్రపంచంలో వేరే ఉద్యోగాలే లేవా?" అని ఆక్రోశిస్తుంది. పక్కింటి సీతమ్మ రాజం గురించి తన భర్తతో, "రాజం కూడా అందరిలాగ కోడలే, ఎంతమాత్రం ఆదర్శప్రాయురాలు కాదు, అత్తవారింటి పొడ గిట్టని అందరు కోడళ్ళ లాంటిదే!" అని అంటుంది. చుట్టుపక్కలవారు కూడా రాజం ఆరు నెలల ముందు పుట్టింటికి వచ్చిందని, ఆమెకు రెండు నెలల ముందు టైఫాయిడు వచ్చి తగ్గిపోయినా అత్తింటికి ఇంకా వెళ్ళలేదని లెక్కలు వేస్తుంటారు.

రాజం తల్లిదండ్రులు కూడా ఆమెను అత్తవారింటికి పంపాలని ఆలోచించి అల్లుడుతో తీసుకువెళ్ళమని చెపుతారు. అతను మాత్రం "రాజంకి ఎక్కడ అనుకూలంగా ఉందో అక్కడ ఎంతకాలం ఉండాలంటే అంత కాలం ఉంటుంది" అని అంటాడు. చివరికి తల్లిదండ్రులే ఆమెను అత్తగారింట్లో దిగబెడతారు. అక్కడ అత్తగారిపట్ల, ఆడపడుచుపట్ల, మునుపటి లొంగుబాటు విడచిన రాజం కొంత స్వతంత్ర వ్యక్తిగా నడుచుకుంటుంది. భవాని కూడా ఆమెపై గతంలో చూపిన దౌష్ట్యాన్ని చూపించకుండా కొంత స్నేహంగానే ఉంటుంది. ఒకసారి రాజం తన కళ్ళముందే భవాని కొడుకు పడిపోయినా, తాను కొంచమైనా కదలలేదని, పైకి లేపలేదని, వాడిని పట్టించుకోలేదని గమనించి, "నాకు పసిపిల్లలపైనకూడా ద్వేషమా?" అని తనపట్ల తానే ఆశ్చర్యపడుతుంది.

ఇంట్లో తరచుగా జరిగే విందు వినోదాలకు భర్త 'మెను' తయారుచేయడం, అన్నీ సరిగ్గా ఉన్నాయా అని చూసుకోవడం కూడా ఆమెకు వెటకారం గానే కనిపిస్తాయి. భర్తతో చిన్న చిన్న విషయాల గురించికూడా రాజం ఎన్నో వాదోపవాదాలు చేస్తుంది; ఎవరు ఎది చెప్పినా వ్యతిరేకంగా ఆలోచించడం ఆమెకు అలవాటుగా మారిపోయింది. భర్తతో గొడవపడి "నన్ను మా ఇంటికి పంపించేయండి!" అని బొబ్బలు పెట్టి రాజం మళ్ళీ పుట్టింటికి చేరుకుంది.

అక్కడా ఆమెకు మనశ్శాంతి లభించదు. గతకాలంలో మంచి గాయకురాలుగా, మంచి కోడలుగా, శ్లాఘించిన లోకులు రాజంని అలా గుర్తించడం లేదు కదా "ఈమేనా ఆ రాజం?" అని గుసగుసలాడడం గమనిస్తుంది; తల్లి హితోక్తులుకూడా కటువుగానే కనిపిస్తాయి. "సంతానం కోసం ఆపరేషన్ చేయిస్తాను" అన్న తల్లితో దానిగురించికూడా గొడవపడుతుంది.

అన్ని విధాలుగా నలిగి, కృంగి, నిలకడలేని ఆలోచనలతో అలసిపోయిన రాజం చివరకు తన భర్త మాత్రమే తనకు ఉనికిని, భద్రతను కలిగించగలడని, అతనివద్ద మాత్రమే తను ప్రశాంతంగా జీవించడం సాధ్యం అనే నిర్ణయంకి వస్తుంది. తనకు సంగీతం ఒక శాపంగా, మానసిక వ్యాధిగా మారిందని, రంగస్థలంకోసం తాను భర్తను వదులుకున్నానని లోకులు అనుకోవడం గమనించిన రాజంకి బాహ్యప్రపంచం బోధపడింది. భర్త ఆదరణ లేకుండా తనకు గౌరవం, అర్హత లభించవని తెలుసుకున్న రాజం భర్తని రమ్మని లేఖ రాస్తుంది.

ఆత్మగౌరవం, స్వంతంత్రభావాలున్న ఆడపిల్ల భర్తకోసం, ఆయన ప్రేమకోసం పరితపించి ఆమె రాసిన లేఖలో మనకి గోచరిస్తుంది: "దయచేసి రండి. ఇక్కడ కొన్నాళ్ళు దంపతులుగా ఉండి మనం మన ఊరు వెళ్దాం. ఇక్కడ నాకు మనశ్శాంతి, గౌరవం లేవు; అనాధలా, దిక్కుమాలిన పక్షిలాగ అనిపిస్తోంది. ఇది నా ఆశ్రయం కాదని అందరూ అంటున్నారు. నా బ్రతుకుని తలచుకుంటే నాకు విసుగు వస్తోంది. నేను మద్రాసు రావడానికి వెనుకాడుతున్నాను. ఇక్కడ నాకు శాంతి లేదు. మనిద్దరం పంచుకునే జీవితం అపూర్ణమైనదని నేను నమ్ముతున్నాను. ఇందులో నా ఆదర్శాలకు చోటు లేదు. ఇది సరియైన నిర్ణయం అని గ్రహించాను. మీరు లేకుండా నా జీవితాన్ని కల్పన చేయలేను!" అని మనస్ఫూర్తిగా రాజం రాసిన లేఖకు, ఆమె ప్రియమైన ఆజ్ఞకు కట్టుబడిన రఘుపతి ఆమెను వచ్చి చేరడంలో కథ సుఖాంతమౌతుంది.

ఇలా ప్రతీ ఘట్టాన్ని యధాతథామైన మానసిక విశ్లేషణతో, సంఘర్షణతో, సున్నితమైన హృదయావేశంతో, విపులంగా వ్రాయగలగటం చేయి తిరిగిన రచయతలకి తప్ప మరెవరికి సాధ్యం? ఇందియాదేవి  సున్నిత మనస్కురాలైన రాజం కథను చక్కటి సంబాషణలతో, సమగ్ర పాత్రచిత్రణతో, మంచి కథా నైపుణ్యంతో, భావుకతను  వ్యక్తీకరిస్తూ  చాలా చక్కగా నడిపించారు. 'ఎలా రాజేశ్వరి కథ ముగుస్తుందా?' అనే ఉత్కంఠతో సాగిన ఈ రచన చివరికి 'కావేరీనది సాగరసంగమం' లాగ రాజం భర్తని చేరడంతో చక్కని ముగింపు, మంచి అనుభూతి, రసానందం, పాఠకుల మనస్సుకి ఆహ్లాదాన్ని కలిగిస్తుందని అనడంలో సందేహం లేదు.

********